

కేయూ 'లా' పరీక్షల టైంటేబుల్ విడుదల

కేయూ లా పరీక్షల టైం టేబుల్‌ను పరీక్షల విభాగం అధికారులు విడుదల చేశారు.

- 8లో▸



యూనివర్సిటీలు నిర్వీర్యం

రాష్ట్ర సాధనలో కీలకంగా వ్యవహరించిన యూనివర్సిటీలను సీఎం కేసీఆర్ నిర్వీర్యం చేస్తున్నారని ఎమ్మెల్యే ఈటల రాజేందర్ విమర్శించారు.

- 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
$31^0/25^0$

వాతావరణం

జిల్లాలో పొడి వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు మామూలుగా ఉంటుంది. పలు చోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పేదల సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వాలు



నెహ్రూసెంటర్: పేదల సంక్షేమాన్ని మరచి ప్రభుత్వాలు పాలన సాగిస్తున్నాయని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.నాగయ్య అన్నారు. జిల్లా కేంద్రంలో సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితులను సమీక్షించి కనీస వేతనాలు నిర్ణయించి లేబర్ డిపార్ట్‌మెంట్ ద్వారా వేతనాలు అమలయ్యేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మండ రాజన్న, అల్వాల వీరయ్య, సహాయ కార్యదర్శులు కుర్ర మహేష్, వంగూరి వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షుడు బాణాల రాజన్న, చంద్రకళ, చేపూరి గణేష్, నాయులు బ్రహ్మచారి, అనంతరావు, రామకృష్ణ, రామేశ్వరం, తిరుపతి, వీరభద్రం, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో ఏడాది జైలు

కురవి: బాలికను వేధించిన కేసులో పోక్సో చట్టం ప్రకారం కురవి మండలం రాజోలు శివారు బాలు తండాకు చెందిన భూక్య ప్రసాద్‌కు వాదోపవాదాలు విన్న తర్వాత జిల్లా జడ్జి పి. చంద్రశేఖర్ ప్రసాద్ ఏడాది జైలు శిక్ష, రూ.4వేలు జరిమానాను విధించినట్లు కురవి ఎస్సై బి. గోపి తెలిపారు. సోమవారం ఎస్సై మాట్లాడుతూ 2021లో కేసు నమోదు అయినట్లు తెలిపారు. ఆకతాయిలు జాగ్రత్తగా ఉండాలన్నారు. పోక్సో వంటి కఠిన చట్టాలున్నాయని హెచ్చరించారు.

అట్రాసిటి కేసుపై విచారణ

నెల్లికుదురు: మండలంలోని మునిగలవీడులో సోమవారం తొర్రూర్ డీఎస్పీ జి. వెంకటేశ్వర బాబు సోమవారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసుపై విచారణ చేపట్టారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. మునిగలవీడు శివారు పంతులుతండాకు చెందిన గుగులోతు రవి ఈనెల 8న పొలంలో పనులు చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో పొలం గట్టు పక్కన వారు బంజర గ్రామానికి చెందిన ఏడుగురు తమపై కర్రలు, గొడ్డలితో విచక్షణ రహితంగా దాడికి పాల్పడడంతోపాటు కులం పేరుతో దూషించారు. దీంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో రవి ఫిర్యాదు మేరకు ఎస్సై కె. క్రాంతికిరణ్ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేశారు. ఈ కేసులో క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, నివేదికను సంబంధిత ఉన్నతాధికారులకు పంపిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.

సమైక్యతా దినోత్సవానికి అతిథులు వీరే..

హన్మకొండ అర్బన్: తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 17న ఉమ్మడి జిల్లాలోని వివిధ జిల్లాలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించేందుకు ముఖ్య అతిథులను కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈసందర్భంగా సెప్టెంబర్ 17న జరిగే కార్యక్రమాల్లో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని పతాకావిష్కరణ చేసి పోలీస్ వందనం స్వీకరిస్తారు. జిల్లా స్థాయిలో ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేయాల్సిందిగా.. అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

జిల్లాల వారీగా అతిథులు

హనుమకొండలో ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, వరంగల్‌లో ఎమ్మెల్సీ, మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, భూపాలపల్లిలో ఎమ్మెల్సీ, రైతు సమన్వయ సమితి చైర్మన్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జనగామలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మహబూబాబాద్‌లో మంత్రి సత్యవతి రాథోడ్, ములుగులో ప్రభుత్వ విప్ ఎం.ఎస్ ప్రభాకర్‌రావు పాల్గొంటారు.

యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

మహబూబాబాద్ రూరల్: ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల వ్యాపారులు యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని జిల్లా టాస్క్ ఫోర్సు సీఐ శ్రీనివాస్, ఏఓ తిరుపతిరెడ్డి అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల దుకాణాలను సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ శ్రీనివాస్, ఏఓ తిరుపతిరెడ్డి ఆయా షాపుల్లోని అన్ని రకాల రికార్డులను పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా రైతులను ఎవరైన ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుని షాపుల లైసెన్సుల రద్దుకు సిఫారసు చేస్తామన్నారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వ్యాపారులు ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల కృత్రిమ కొరత సృష్టించొద్దని సూచించారు. యూరియా ఉన్నప్పటికీ లేదంటూ, అధిక ధరలకు విక్రయించడం లాంటి పద్ధతులు మానుకోవాలన్నారు. లేదంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

విన్నపాలు సరే.. పరిష్కారం ఏదీ?

- ప్రజావాణికి చెప్పులరిగేలా తిరుగుతున్న బాధితులు
- రవాణా చార్జీలు కూడా వృథా అవుతున్నాయని ఆవేదన
- ఇప్పటి వరకు 1,809 దరఖాస్తులు పెండింగ్
- గ్రీవెన్స్‌కు అధికారుల గైర్హాజర్
- సమయపాలన పాటించని పలువురు
- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న వైనం



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శశాంక, అధికారులు

సాక్షి పరిశీలన

మహబూబాబాద్: సమస్యల సత్వర పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమాన్ని అధికారులు నిర్వహిస్తున్నారు. దీంతో సమస్యలు పరిష్కారం అవుతాయని జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి రవాణా ఖర్చులు భరించి వారి విన్నపాలను కలెక్టర్, అధికారులకు విన్నవించుకుంటున్నారు. అయితే వారి సమస్యకు పరిష్కారం లభించకపోవడంతో ప్రజలు నిరాశతో వెనుతిరుగుతున్నారు. కలెక్టర్ శశాంక వినతులను సంబంధిత అధికారులకు ఇస్తున్నా... ఆయా శాఖల అధికారులు వినతులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు చెప్పులరిగేలా తిరుగుతున్నా..సమస్యలు పరిష్కారం కావడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

1,809 వినతులు పెండింగ్..

జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో ప్రతీ సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు 31,353 వినతులు రాగా దానిలో 29,544 పరిష్కారం అయ్యాయి. మిగతా 1,809 వినతులు పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు తెలిపారు. ఎక్కువగా భూ సమస్యలు, ఫించన్లు, డబుల్ బెడ్ రూం ఇళ్లు, ఉద్యోగావకాశాలు కల్పించాలని వినతులు సమర్పిస్తున్నారు.

శాఖల వారీగా పెండింగ్ దరఖాస్తులు

కేసముద్రం తహసీల్దార్ కార్యాలయానికి 102,



కలెక్టరేట్ సమావేశ మందిరం ఎదుట బారులు తీరిన దరఖాస్తుదారులు

మానుకోట తహసీల్దార్ 163, మానుకోట ఆర్డీఓ కార్యాలయం 82, ఎస్టీ కార్పొరేషన్ 77, ఎస్సీ కార్పొరేషన్ 60, కలెక్టరేట్‌కు సంబంధించినవి 240, డీపీఓ కార్యాలయం 23, డీఈఓ కార్యాలయం 20, డీఎఫ్‌ఓ 43, డీఆర్‌డీపీ 37, విద్యుత్ శాఖ 35, హౌసింగ్ 45, లీడ్ బ్యాంక్ మేనేజర్ 29, మానుకోట మున్సిపాలిటీ 42, తొర్రూర్ మున్సిపాలిటీ 33, ఎస్సీ కార్యాలయం 37, సర్వే ల్యాండ్ రికార్డు 55, జిల్లా సంక్షేమ శాఖ 35, తొర్రూర్ ఆర్డీఓ కార్యాలయం 29, బయ్యారం తహసీల్దార్ 31, చిన్నగూడూర్ 25, గూడూర్ తహసీల్దార్ 31, ఇనుగుర్తి తహసీల్దార్ 49, కురవి తహసీల్దార్ 45, మరిపెడ తహసీల్దార్ కార్యాలయం 33, సీరోల్ తహసీల్దార్ కార్యాలయానికి 22 వినతులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రతి ప్రజావాణిలో కలెక్టర్ శశాంక పెండింగ్ వినతులను పరిష్కరించాలని, సాధ్యం కాకుంటే కారణాలతో కూడిన నివేదిక అందజేయాలని ఆదేశిస్తున్నారు.

ఖాళీగా కుర్చీలు..

ఈ నెల 11న నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్ సమయం ప్రకారం వినతులు స్వీకరించారు. ఆ సమయంలో సగం మంది అధికారులు కూడా హాజరు కాలేదు. దీంతో కుర్చీలన్నీ ఖాళీగా ఉన్నాయి. కలెక్టర్, అధికారులు రాలేదని దరఖాస్తు దారులు కూడా వినతులు ఇవ్వడానికి ఇష్టపడలేదు. ఉదయం 11.22 గంటలకు కలెక్టర్ శశాంకతో పాటు అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, జెడ్పీ సీఈఓ రమాదేవి, డీఆర్‌డీఏ పీడీ సన్యాసయ్య, ఉద్యానశాఖాధికారి సూర్యనారాయణ, డీపీఓ నర్మద, సీపీఓ సుబ్బారావు, మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణితో పాటు మరికొంత మంది అధికారులు హాజరయ్యారు. అనంతరం కలెక్టర్ వినతులు స్వీకరించారు. దరఖాస్తుదారులు కూడా బారులు తీరారు.

సమయపాలన ఏదీ?

కొంతమంది జిల్లా అధికారులు కలెక్టర్ వచ్చారా లేదా అని తెలుసుకుని ప్రజావాణికి హాజరవుతున్నారు. ఒకవేళ కలెక్టర్ హాజరుకాకపోతే అధికారులు కూడా హాజరు కావడం లేదు. హాజరైనా.. సెల్ ఫోన్‌లో మెసేజ్‌లు చూసుకోవడం, క్యాంటీన్‌లో టీ తాగుతూ సరదాగా గడుపుతున్నారు. కలెక్టర్ వచ్చారని తెలియగానే సమావేశ మందిరానికి వచ్చి కూర్చుంటున్నారు. ఈ నెల 11న జరిగిన ప్రజావాణిలో డీఎంహెచ్‌ఓ, మానుకోట తహసీల్దార్, ఆర్డీఓ తరఫున అధికారులు హాజరు కాలేదు. అలాగే పరిశ్రమల శాఖ లేబర్ కార్యాలయం నుంచి కూడా అధికారులు హాజరు కాలేదు. డీఏఓ ఛత్రునాయక్, తదితర అధికారులు గైర్హాజర్ అయ్యారు.



పై ఫొటోలో తన మూగ కుమారుడితో కలెక్టరేట్‌కు వచ్చిన వృద్ధురాలు పేరు టేకులగూడెంకు చెందిన పి.భద్రమ్మ. ఉండటానికి ఇల్లు లేదు. డబుల్ బెడ్ రూం ఇల్లు కోసం దరఖాస్తు చేసుకున్నా.. రాలేదు. కుమారుడు రమేష్ మూగ వాడు కావడంతో దివ్యాంగుల పింఛన్ కోసం కలెక్టర్ కార్యాలయానికి మూడు సార్లు వచ్చినా... పింఛన్ మంజూరు కాలేదు. ప్రతీసారి అధికారులు దరఖాస్తు తీసుకుంటున్నారు... పంపుతున్నారు. కానీ పని మాత్రం కావడం లేదు. పైగా తన కుమారుడిని ఆటోలో తీసుకురావడానికి రవాణా ఖర్చులు కూడా అధికంగా అవుతున్నాయని వాపోయింది. ఇలా జిల్లా వ్యాప్తంగా పలువురు బాధితుల సమస్యలు పరిష్కారం కాకపోవడంతో కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నారు.

త్వరగా పరిష్కరించాలి: కలెక్టర్

ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ కె.శశాంక అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజావాణిలో మొత్తం 128 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

ఎనిమిది సార్లు వినతులు ఇచ్చా..



నాకు నాలుగు ఎకరాల పట్టా భూమి ఉంది. సర్వే నంబర్ 166/19,180/4 కాగా అన్ని పత్రాలు ఉన్నా.. తహసీల్దార్ పట్టా పాస్ పుస్తకం ఇవ్వడం లేదు. మండల కార్యాలయం చుట్టూ తిరిగి తిరిగి చివరికి కలెక్టర్ కార్యాలయంలో వినతులు ఇచ్చాను. ఇప్పటికీ ఎనిమిది సార్లు వచ్చినా.. సమస్య పరిష్కారం కావడం లేదు.

-గుగులోత్ మంగిలాల్, కేసముద్రం

రైతులు ఇబ్బందులు పడుతున్నారు..



మానుకోట మండలంలోని నడివాడ, కంబాలపల్లి, జమాండ్లపల్లి, రంగశాయిపేట గ్రామాలకు చెందిన 300 ఎకరాల భూములకు పట్టాలు ఇవ్వలేదు. ఆ భూమి అటవీ భూమి కాదని ఫారెస్ట్ అధికారులు రాసి ఇచ్చారు. అయినా రెవెన్యూ అధికారులు పట్టాలు ఇవ్వకపోవడంతో సుమారు 200 మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు కలెక్టర్‌కు వినతులు ఇచ్చిన అధికారులు స్పందించడం లేదు. ఇక్కడ పరిష్కారం కాకుంటే ఎక్కడికి వెళ్లాలో అర్థం కావడం లేదు.

-శ్రీపాల్‌రెడ్డి, నడివాడ ఎంపీటీసీ, సత్యనారాయణ, వీరన్న, రాజు

డిజిటల్ సంతకానికి..



నాకు మాటేడ్ గ్రామంలో 2.11ఎకరాల భూమి ఉంది. రికార్డులో ఎకరం 11 గుంటలు ఉండగా కేవలం ఆర్‌ఎస్ లాగిన్‌లో 25 గుంటల భూమి చూపిస్తుంది. దానికి సంబంధించిన డిజిటల్ సంతకం కూడా పెండింగ్‌లో ఉంది. ఇప్పటికీ నాలుగు సారు కలెక్టర్ కార్యాలయానికి వచ్చాను. పని కావడం లేదు.

-ఎస్.వెంకటేష్, మాటేడ్, తొర్రూరు

కేసీఆర్ పాలనలోనే గ్రామాలు అభివృద్ధి

- మంత్రి దయాకర్‌రావు



మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు

పెద్దవంగర: సీఎం కేసీఆర్ పాలనలోనే గ్రామాలు, గిరిజన తండాలు అభివృద్ధి చెందుతున్నాయని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మంత్రి మాట్లాడారు. పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నానని, బీఆర్ఎస్ అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. రెడ్డికుంట తండాకు చెందిన కాంగ్రెస్ ఉప సర్పంచ్ కోబ్లా నాయక్‌ను బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, ప్రధాన కార్యదర్శి శ్రీరాం సంజయ్, మాజీ జెడ్పీటీసీ జాటోతు కమలాకర్, కేతిరెడ్డి సోమనర్సింహారెడ్డి, బొమ్మెరబోయిర రాజు, ముజీబ్, శ్రీరాం సంజయ్, చిలుక భిక్షపతి, నాయకులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి

- డీఎస్పీ సత్యనారాయణ



కిట్ ఆర్టికల్స్ పరిశీలిస్తున్న డీఎస్పీ సత్యనారాయణ

మహబూబాబాద్ రూరల్ : పోలీసు అధికారులు, సిబ్బంది విధులపట్ల అంకితభావంతో పనిచేయాలని డీఎస్పీ తీర్థాల సత్యనారాయణ అన్నారు. మహబూబాబాద్ పోలీస్‌స్టేషన్‌ను డీఎస్పీ సత్యనారాయణ సోమవారం తనిఖీ చేసి పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం పోలీస్ సిబ్బంది నీట్ టర్న్ ఔట్, కిట్ ఆర్టికల్స్ పరిశీలించారు. డీఎస్పీ సత్యనారాయణకు పోలీస్ సిబ్బంది నిర్వహిస్తున్న విధులను టౌన్ సీఐ సతీష్ వివరించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలన్నారు. పోలీస్ స్టేషన్‌లోని వర్టికల్స్ నిర్వహణ, హెచ్‌ఆర్‌ఎంఎస్, ఆన్ లైన్ వినియోగం, టీఎస్ కాప్స్, సీసీటీఎన్‌ఎస్ ఆన్‌లైన్‌లో కేసుల వివరాలు నమోదు చేసే విషయాల గురించి అడిగి తెలుసుకున్నారు. బ్లూ కోల్ట్స్, పెట్రో కార్స్ నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని, డయల్ 100 కాల్స్ వచ్చిన వెంటనే స్పందించి సంఘటన స్థలానికి చేరుకొని బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు విజయరాంకుమార్, రామారావు, తాహెర్ బాబా, దీపికరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలి

- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్



మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

మహబూబాబాద్: ఓటర్ల దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ వేగవంతం చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ ఆదేశించారు. హైదరాబాద్ నుంచి సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్‌లతో ఓటర్ల దరఖాస్తులు తదితర విషయాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె. శశాంక మాట్లాడుతూ నూతన ఓటర్ల నమోదు, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ వేగవంతం చేశామన్నారు. ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీ చేపట్టడం జరిగిందన్నారు. సంబంధిత అధికారులు సమన్వయంతో చర్యలు చేపడుతామన్నారు. మానుకోట జిల్లా నుంచి వీసీలో ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

రుణాలను మంజూరు చేయాలి

రైతుల రుణాల మంజూరును వేగవంతం చేయాలని కలెక్టర్ శశాంక ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో డీసీసీ అండ్ డీఎల్ ఆర్‌సి సమావేశం నిర్వహించి రైతుల రుణాల విషయంలో కలెక్టర్ సమీక్షించారు. రుణమాఫీ జరిగిన ఖాతాదారులకు వెంటనే కొత్త రుణాలు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం సత్యనారాయణమూర్తి, అధికారులు పాల్గొన్నారు.

కంట్రోల్ రూం ప్రారంభం

కలెక్టరేట్‌లో సీసీ కెమెరాల కంట్రోల్ రూంను కలెక్టర్ శశాంక ప్రారంభించారు. కలెక్టరేట్ లోపలి భాగంలో 34, వెలుపల 5 పీటీజెడ్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని, నిరంతరం సీసీ కెమెరాల పర్యవేక్షణలో కలెక్టరేట్ ఉంటుందని కలెక్టర్ తెలిపారు.

పేస్కేల్ అమలు చేయాలని వంటావార్పు



రోడ్డుపై భోజనం చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు

మహబూబాబాద్: సమగ్ర శిక్ష ఉద్యోగులందరిని విద్యాశాఖలో విలీనం చేసి కనీస వేతన పేస్కేల్ అమలు చేయాలని ఎంఐఎస్ కోఆర్డినేటర్ ఖాదర్ డిమాండ్ చేశారు. తెలంగాణ సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన దీక్షలో భాగంగా సోమవారం వంటావార్పు కార్యక్రమం చేసి రోడ్లపైనే భోజనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఖాదర్ మాట్లాడుతూ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలి

- ఎస్పీ జీ.చంద్రమోహన్



మాట్లాడుతున్న ఎస్పీ చంద్రమోహన్

మహబూబాబాద్ రూరల్ : ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా విధులు నిర్వహించాలని ఎస్పీ జీ.చంద్రమోహన్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏ.ఆర్ పోలీస్ సిబ్బంది, స్పెషల్ పార్టీ, హోం గార్డ్ ఆఫీసర్లతో సోమవారం దర్బార్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ పోలీస్ సిబ్బంది సాధక బాధకాలు అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ముఖ్యంగా రాబోయే ఎన్నికల్లో శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలుగకుండా ప్రతిష్టాత్మకంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయ్ ప్రతాప్, ఆర్ఐలు అనిల్, భాస్కర్, సొమ్మల్లు, ఆర్ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

కారు నేతలు కలిసినట్టే..నా!?

- మంత్రి సత్యవతి ఇంటికి వెళ్లిన ఎమ్మెల్యే రెడ్యా
- ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి ఇంటికి వెళ్లిన ఎమ్మెల్యే శంకర్‌నాయక్ సతీమణి
- అధినాయకుడి ఆదేశాలకు కార్యరూపం
- 'మేమెలా కలుస్తాం' అంటున్న క్యాడర్



సాక్షి, మహబూబాబాద్: ఔను వాళ్లందరు ఒక్కటయ్యారా.. అంటే అవునని కొందరు.. కాదని.. మరికొందరు.. ఎన్నికల సీజన్ ఏదైనా సాధ్యమేనని ఇంకొందరు.. మానుకోట గులాబీ పార్టీలో జరిగిన పరిణామాలపై జిల్లా వ్యాప్తంగా రకరకాల చర్చ జరుగుతోంది. ఏదైతే అసాధ్యమనుకున్నారో.. అదే సాధ్యం అవుతుందని, రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరనడానికే మంత్రి సత్యవతి రాథోడ్ ఇంటికి ఎమ్మెల్యే రెడ్యానాయక్ వెళ్లడం.. ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు ఇంటికి ఎమ్మెల్యే శంకర్‌నాయక్ సతీమణి సీతామాలక్ష్మీ వెళ్లడం.. ఇందుకు నిదర్శనమని జిల్లాలోని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు.

నిన్నటి వరకు ఇలా..

మానుకోట జిల్లాలోని బీఆర్ఎస్ నాయకుల మధ్య ఒడవని గొడవ సాగుతుంది. ఇందులో భాగంగా మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే రెడ్యానాయక్‌ల మధ్య దశాబ్దాల శత్రుత్వం. ఈ నేపథ్యంలోనే సత్యవతి మంత్రిగా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు, అన్ని జిల్లాల్లో పర్యటించినా.. డోర్నకల్ నియోజకవర్గంలో మాత్రం ఏనాడు అధికారిక కార్యక్రమాల్లో పర్యటించలేదు. అదేవిధంగా ఆ నియోజకవర్గంలోని సత్యవతి వర్గీయులకు పార్టీ పదవులు ఇవ్వలేదు. ప్రభుత్వ పథకాలు దళితబంధు, డబుల్ బెడ్ రూం ఇళ్లు, ఇప్పుడు గృహలక్ష్మీ వంటి పథకాలు రెడ్యానాయక్ కోటా నుంచి ఇవ్వలేదు. అదేవిధంగా ఇటీవల రెడ్యానాయక్ చేపట్టిన నియోజకవర్గ పర్యటనలో పలు చోట్ల నిరసనలు, అడ్డగింతలు జరిగాయి. అయితే వీటికి తన సొంత పార్టీలోని నాయకులే చేస్తున్న కుట్ర అని, మా పార్టీ వారే మాకు శత్రువులు అని రెడ్యానాయక్ బహిరంగంగా అన్నారు. రెడ్యానాయక్ సత్యవతి రాథోడ్‌ను ఉద్దేశించే అన్నారని నియోజకవర్గంలో చర్చ జరిగింది. అదేవిధంగా మహబూబాబాద్ నియోజకవర్గంలో తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, ఎమ్మెల్యే శంకర్‌నాయక్ మధ్య వైరం పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే వరకు వచ్చింది. అసలు శంకర్‌నాయక్‌కు పార్టీ టికెట్ ఇవ్వద్దని నియోజకవర్గం వ్యాప్తంగా ఆందోళనలు, నిరసనలు చేసిన సంఘటనలు ఉన్నాయి. మహబూబాబాద్ నియోజకవర్గంలో కూడా ఎమ్మెల్సీ వర్గీయులకు సంక్షేమ పథకాలు, నిధుల పంపిణీలో అవకాశం ఇవ్వడం లేదనే పంచాయితీ పార్టీ అధిష్టానం వద్దకు చేరింది.

ఇప్పుడిలా..

అయితే గతం గతహా అన్నట్లు మానుకోట జిల్లా బీఆర్ఎస్ నాయకులు వ్యవహరిస్తున్నారు. అందరు కలిసి పోవాలని, అందరి మద్దతు ఉంటేనే గెలుస్తారని పార్టీ అధినాయకత్వం నుంచి ఆదేశాలు వచ్చినట్లు చర్చ. ఈ నేపథ్యంలోనే డోర్నకల్ నియోజకవర్గంలోని రోడ్ల మరమత్తు, కొత్త రోడ్ల నిర్మాణానికి ఐటీడీఏ నిధులు మంజూరు చేసిన మంత్రి సత్యవతికి ఎమ్మెల్యే రెడ్యానాయక్ కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్‌లోని మంత్రి నివాసానికి ఎమ్మెల్యే రెడ్యాతోపాటు, కూతురు ఎంపీ కవిత కుటుంబ సభ్యులు వెళ్లి కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ఈనెల 9వ తేదీన ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు పుట్టిన రోజు సందర్భంగా ఎమ్మెల్యే సతీమణి సీతామాలక్ష్మీతోపాటు ఎమ్మెల్యే అనుచరులు మహబూబాబాద్ పట్టణంలోని ఎమ్మెల్సీ ఇంటికి వెళ్లి శుభాకాంక్షలు తెలపడంతో అక్కడున్న వారందరు ఆశ్చర్యపోయారు. ఈ పరిస్థితిలో నాయకులు ఒక్కటైతే మంత్రి, ఎమ్మెల్సీ అనుచరులు ఏ మేరకు సహకరిస్తారో.. అనుచరులను బుజ్జగించేందుకు ఏం చేస్తారో...లేకా ఎన్నికల నోటిఫికేషన్ నాటికి మరెన్ని పరిణామాలు చోటు చేసుకుంటాయో అనేది రాజకీయ చర్చ.

నెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ



కేసముద్రం: నిర్మల్ జిల్లాలో ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు జరిగిన 6వ రాష్ట్రస్థాయి సీనియర్ నెట్‌బాల్ పోటీల్లో జిల్లా సీనియర్ పురుషుల జట్టుకు 2వ స్థానం లభించింది. అలాగే 2వ ఫాస్ట్ 5 రాష్ట్ర స్థాయి పోటీల్లో 3వ స్థానం లభించినట్లు నెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేం వాసుదేవరెడ్డి, తుమ్మ సురేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జట్టుకు కేసముద్రం మండలం అమీనాపురం గ్రామానికి చెందిన జన్ను హరీష్ కెప్టెన్‌గా వ్యవహరించినట్లు పేర్కొన్నారు.

రెడ్యానాయక్‌కు 'దళిత బంధు' నిరసన సెగ



ఎమ్మెల్యేను దళితబంధుపై అడుగుతున్న దళితులు

నర్సింహులపేట: డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్‌కు దళితబంధు నిరసన సెగ తగిలింది. నర్సింహులపేటలో సోమవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఎమ్మెల్యే రెడ్యానాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వందమంది దాకా దళితులు వచ్చి.. అర్హులందరికీ దళితబంధు పథకం వర్తింపజేయాలని నినాదాలు చేశారు. ఎమ్మెల్యే దగ్గరికి వెళ్లేందుకు యత్నించగా పోలీసులు, అక్కడే ఉన్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మైదం దేవేందర్, ఎంపీపీ భర్త, పార్టీ నాయకుడు యాదగిరిరెడ్డి అడ్డుకున్నారు. దీంతో కొద్దిసేపు ఆగిన వారు.. అనంతరం ఎమ్మెల్యే బయటికి వెళ్తుండగా అడ్డు తగిలారు. అర్హత కలిగిన వారు ఎక్కువగా ఉన్నారని, యూనిట్లు పెంచాలని ఎమ్మెల్యేను కోరారు. మంజూరైనవి జనాభా ప్రాతిపదికన ఇచ్చామని, మరికొన్ని త్వరలో వస్తాయని చెప్పడంతో శాంతించారు. ఎమ్మెల్యే వెళ్లగానే నాయకులు మైదం దేవేందర్, యాదగిరిరెడ్డిలతో వాగ్వాదానికి దిగారు. నాయకులు ఏమీ మాట్లాడకుండా వెళ్లిపోవడంతో దళితులు కూడా వెళ్లిపోయారు.

కేయూ 'లా' పరీక్షల టైంటేబుల్‌ విడుదల



కేయూ క్యాంపస్‌: వాయిదా పడిన 'లా' పరీక్షల టైంటేబుల్‌ను పరీక్షల విభాగం అధికారులు సోమవారం విడుదల చేశారు. కాగా, ఐదు సంవత్సరాల 'లా' కోర్సు ఫైనల్‌ ఇయర్‌ విద్యార్థి ఒకరు తనకు కర్నాటకలోని సెంట్రల్‌ యూనివర్సిటీలో ఎల్‌ఎల్‌ఎం సీటు వచ్చిందని, ఫైనల్‌ ఇయర్‌ పరీక్షలు రెండుసార్లు వాయిదా వేయడంతో తాను సీటు కోల్పోయే పరిస్థితి ఉందని, ఇప్పటికైనా పరీక్షలు నిర్వహించాలని, లేని పక్షంలో ఆత్మహత్య చేసుకుంటానని ఓ వీడియోను సోషల్‌మీడియాలో పోస్ట్‌ చేశాడు. ఈ వీడియో యూనివర్సిటీ అధికారుల దృష్టికి వెళ్లింది. దీనికి స్పందించిన పరీక్షల విభాగం అధికారులు 'లా' కోర్సుల పరీక్షల టైంటేబుల్‌ను విడుదల చేశారు. ఐదు సంవత్సరాల ఎల్‌ఎల్‌బీ పదో సెమిస్టర్‌ పరీక్షలు ఈనెల 14 వ తేదీ నుంచి నిర్వహించనున్నామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి,అదనపు పరీక్షల నియంత్రణాధికారి రాధిక తెలిపారు. ఈనెల 14,16,19 తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటలవరకు నిర్వహిస్తామన్నారు.

మూడేళ్ల లాకోర్సు పరీక్షలు కూడా..

కేయూ పరిధిలో మూడేళ్ల 'లా'కోర్సు ఫైనల్‌ ఇయర్‌ ఆరో సెమిస్టర్‌ పరీక్షలు కూడా ఈనెల 14వ తేదీ నుంచి నిర్వహించబోతున్నారు.ఈనెల 14,16,19 తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహిస్తామని పరీక్షల విభాగం అధికారులు తెలిపారు.

గందరగోళానికి ముగింపు..!

విద్యార్థులతో వీసీ చర్చలు
- స్కాలర్‌ హాస్టల్‌ ఓపెన్‌..
- డిమాండ్లపై లిఖితపూర్వక హామీ ఇవ్వాలని విద్యార్థుల పట్టు
- చూద్దాం.. చేద్దాం అన్న వీసీ రమేష్‌



విద్యార్థులతో చర్చలు జరుపుతున్న వీసీ

కేయూ క్యాంపస్‌/వరంగల్‌ క్రైం: కేయూలో పీహెచ్‌డీ అడ్మిషన్ల వ్యవహారంలో కేయూ విద్యార్థి జాక్‌ ఆధ్వర్యంలో ఆరు రోజుల నుంచి కొనసాగుతున్న దీక్షను విరమింపచేసేందుకు గాను వీసీతోపాటు పోలీసు అధికారులు సోమవారం విద్యార్థి నాయకులను చర్చలకు ఆహ్వానించారు. కేయూ హాస్టళ్ల డైరెక్టర్‌ వెంకయ్య దీక్ష శిబిరం వద్దకు వచ్చి విద్యార్థి నాయకులను చర్చలకు ఆహ్వానించారు. పరిపాలనా భవనంలోని అకడమిక్‌ హాల్‌లో చర్చలు కొనసాగించారు. ఈ సందర్భంగా వివిధ విద్యార్థి సంఘాల నాయకులు తమ డిమాండ్లను అధికారుల ముందుంచారు. పీహెచ్‌డీ కేటగిరీ-2లో జరిగిన అక్రమాలపై ప్రశ్నించిన విద్యార్థులపై నమోదు చేసిన అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలి.. అన్ని డిపార్ట్‌మెంట్ల వారీగా వెకెన్సీ పొజిషన్లను గుర్తించి మెరిట్‌ ప్రకారం రెండో లిస్ట్‌ ప్రకటించి అడ్మిషన్లు జరపాలి.. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రిజిస్ట్రార్‌ వెంటనే తొలగించాలి.. పీహెచ్‌డీ ఫీజుతో పాటు, మిగతా కోర్సుల ఫీజులు తగ్గించాలనే తదితర డిమాండ్లను అధికారుల ఎదుట ఉంచారు. ఈ డిమాండ్లను పరిశీలించిన అనంతరం వీసీ సానుకూలంగా స్పందించారని అధికారులు తెలిపారు. సెలవులు వెంటనే రద్దుచేయాలని, హాస్టళ్లు ఓపెన్‌ చేయాలని కోరగా.. రీసెర్చ్‌ స్కాలర్స్‌ హాస్టళ్లను సోమవారం నుంచి తెరుస్తామని వీసీ తెలిపారు. విద్యార్థులపై నమోదు చేసిన కేసులను ఎత్తివేసే విషయంపై కూడా పరిశీలిస్తామని తెలిపినట్లు సమాచారం. అయితే డిమాండ్లను పరిష్కరిస్తామని లిఖితపూర్వకంగా హామీ ఇస్తేనే దీక్షలు విరమిస్తామని విద్యార్థి నాయకులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏసీపీలు కిరణ్‌కుమార్‌, డేవిడ్‌రాజు, సీఐ శ్రీనివాస్‌, కేయూ విద్యార్థి జేఏసీ నేతలు మంద వీరస్వామి, వలీఉల్లా ఖాద్రీ, తిరుపతి యాదవ్‌, మేడ రంజిత, విజయ్‌ కన్నా, నిమ్మల రాజేష్‌, రాజు నాయక్‌, నర్సింహారావు, వెంకట్‌రెడ్డి, పాషా, మధు, అమర్‌, వంశీ, రాంబాబు పాల్గొన్నారు. కాగా, చర్చలు జరిగినప్పటికీ పూర్తి స్థాయిలో సఫలం కాలేదని, మళ్లీ ఈనెల 13న జరుపుదామని విద్యార్థి నాయకులతో ఏసీపీ తెలిపినట్లు సమాచారం.

నేడు ఉమ్మడి వరంగల్‌ జిల్లా బంద్‌

కేయూలో పీహెచ్‌డీ అడ్మిషన్ల అవకతవకలపై ఆందోళన చేసిన విద్యార్థి నాయకులను పోలీసులు తీవ్రంగా కొట్టి గాయపర్చడాన్ని నిరసిస్తూ.. అందుకు కారకులైన వీసీ రమేష్‌, రిజిస్ట్రార్‌ శ్రీనివాస్‌రావును బర్తరఫ్‌ చేయాలనే డిమాండ్‌తో మంగళవారం ఉమ్మడి వరంగల్‌ జిల్లా బంద్‌కు పిలుపునిచ్చినట్లు కేయూ విద్యార్థి జేఏసీ చైర్మన్‌ తిరుపతియాదవ్‌ సోమవారం తెలిపారు. బంద్‌కు విద్యాసంస్థలతో పాటు వాణిజ్య, వ్యాపార సంస్థలు సహకరించాలని కోరారు.

కేయూలో హాస్టళ్లు తెరవాలి



రిజిస్ట్రార్‌ ఖాళీ కుర్చీకి వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థులు

కేయూ క్యాంపస్‌: కాకతీయ యూనివర్సిటీకి మళ్లీ సెలవులు పొడిగించడాన్ని నిరసిస్తూ వెంటనే హాస్టళ్లు, కళాశాలలు తెరవాలని డిమాండ్‌ చేస్తూ సోమవారం పలువురు విద్యార్థులు పరిపాలనా భవనం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూనివర్సిటీకి తొలుత సెప్టెంబర్‌ 4 వరకు సెలవులు ఇచ్చి మళ్లీ ఆ తరువాత 11వరకు పొడిగించారని ఇప్పుడు ఈనెల 18వరకు పొడిగించారన్నారు. పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోవడం లేదన్నారు. మధ్యాహ్నం వరకు ఆందోళన చేసినా పట్టించుకోకపోవడంతో వినతిపత్రం ఇచ్చేందుకు రిజిస్ట్రార్‌ కార్యాలయానికి వెళ్లగా ఆయన లేకపోవడంతో ఖాళీ కుర్చీకి వినతిపత్రం ఇచ్చామని తెలిపారు. హాస్టళ్లు మూసివేయడంతో పోటీ పరీక్షలకు సన్నద్ధం కాలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గురక జగన్‌వేణు, శివ, అర్బస్‌ఖాన్‌, సాయి, శ్రవణ్‌, సురేష్‌ తదితరులు పాల్గొన్నారు.

16న ఫెన్సింగ్‌ క్రీడలు


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అసోసియేషన్‌ బాధ్యులు

కాజీపేట రూరల్‌: కాజీపేట డీజిల్‌ కాలనీలోని అక్షర హైస్కూల్‌లో ఈ నెల 16వ తేదీన ఉమ్మడి జిల్లా స్థాయిలో ఫెన్సింగ్‌ క్రీడలు నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి వరంగల్‌ జిల్లా ఫెన్సింగ్‌ అసోసియేషన్‌ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.వి.రెడ్డి, దుబ్బరాము అన్నారు. ఈ మేరకు సోమవారం కాజీపేట అక్షర స్కూల్‌లో అండర్‌ -14,17 బాల బాలికల జిల్లా స్థాయి ఫెన్సింగ్‌ క్రీడలకు సంబంధించిన పోస్టర్లను స్కూల్‌ ప్రిన్సిపాల్‌ నవీన్‌రెడ్డి, డైరెక్టర్‌ అనితారెడ్డి, గొట్టిముక్కుల రాజారెడ్డి, బి. విజయ్‌కుమార్‌తో కలిసి ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ప్రతిభకనబర్చిన క్రీడాకారులను ఈ నెల 29, 30, అక్టోబర్‌ 1వ తేదీన వరంగల్‌ ఇండోర్‌ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. వివరాలకు 8686741634 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

రాష్ట్రంలో యూనివర్సిటీలు నిర్వీర్యం

ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌
- తెలంగాణలో దుర్మార్గ పాలన : ఎమ్మెల్యే సీతక్క
- కేయూలో విద్యార్థి జేఏసీ దీక్షాశిబిరం సందర్శన


మాట్లాడుతున్న హుజూరాబాద్‌ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌

కేయూ క్యాంపస్‌: తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలకంగా వ్యవహరించిన యూనివర్సిటీలను సీఎం కేసీఆర్‌ నిర్వీర్యం చేస్తున్నారని హుజూరాబాద్‌ ఎమ్మెల్యే, బీజేపీ ప్రచార కమిటీ చైర్మన్‌ ఈటల రాజేందర్‌ విమర్శించారు. కాకతీయ యూనివర్సిటీలో పీహెచ్‌డీ అడ్మిషన్లలో అవకతకలకు జరిగాయని ఆరోపిస్తూ ఆందోళన చేసిన వివిధ విద్యార్థి సంఘాల బాధ్యులను పోలీసులు కొట్టడంతో గాయాలైన వారితోపాటు వివిధ విద్యార్థి సంఘాల జేఏసీ బాధ్యులు.. వీసీ తాటికొండ రమేష్‌, రిజిస్ట్రార్‌ శ్రీనివాస్‌రావును బర్తరఫ్‌ చేయాలని డిమాండ్‌ చేస్తూ యూనివర్సిటీలోని దూరవిద్య కేంద్రం ఆవరణలో దీక్ష కొనసాగిస్తున్నారు. సోమవారం ఈ దీక్షా శిబిరాన్ని సందర్శించిన అనంతరం ఎమ్మెల్యే ఈటల మాట్లాడారు. విద్యార్థులపై దాడికి కారణమైన కేయూ వీసీని వెంటనే పదవి నుంచి తొలగించాలని డిమాండ్‌ చేశారు. రాష్ట్ర సాధనలో ఉద్యమ కేంద్రాలుగా ఉన్న యూనివర్సిటీ విద్యార్థులను తీవ్రంగా కొట్టించడం దారుణమన్నారు. ఎమ్మెల్సీ పల్లారాజేశ్వర్‌రెడ్డి కనుసన్నల్లోనే ఇక్కడ వీసీ పాలన కొనసాగిస్తున్నారని ఆరోపించారు. మంగళవారం జరుగనున్న విద్యార్థి జేఏసీ బంద్‌కు బీజేపీ సంపూర్ణ మద్దతు తెలుపుతోందన్నారు. కేయూ రిటైర్డ్‌ ప్రొఫెసర్‌ కె వెంకటనారాయణ మాట్లాడుతూ ఎమ్మెల్సీ పల్లారాజేశ్వర్‌రెడ్డి చెప్పినట్లు పాలన కొనసాగిస్తున్న వీసీకి ఆ పదవిలో ఉండే అర్హతలేదన్నారు. ఈ దీక్షల శిబిరంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్‌రెడ్డి,మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, మాజీ ఎంపీలు విజయరామారావు, జితేందర్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షురాలు రావుపద్మ, పద్మచార శ్రీనివాస్‌ రెడ్డి, కుసుమసతీష్‌, కాంగ్రెస్‌ నాయకురాలు కూచన రవళి పాల్గొని మాట్లాడారు. పీహెచ్‌డీ అడ్మిషన్లలో అవకతకలు జరిగాయని ఆరోపిస్తూ ఆందోళన చేస్తే యూనివర్సిటీ అధికారులు పోలీసులతో కొట్టించారని, ఇది దారుణమని మండిపడ్డారు.

రాష్ట్రంలో దుర్మార్గ పాలన

విద్యార్థుల త్యాగాల ఫలితంగా ఏర్పడిన తెలంగాణలో దుర్మార్గ పాలన కొనసాగుతోందని ములుగు ఎమ్మెల్యే సీతక్క విమర్శించారు. కేయూలో విద్యార్థి నాయకులను పరామర్శించి అనంతరం ఆమె మాట్లాడారు. యూనివర్సిటీల్లో వీసీ ,రిజిస్ట్రార్లు పాలకులకు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కేయూ వీసీ, రిజిస్ట్రార్‌ను వెంటనే బర్తరఫ్‌ చేయాలని డిమాండ్‌ చేశారు.

చార్జిషీట్‌ విడుదల..

కేయూ పీహెచ్‌డీ అడ్మిషన్లలో వీసీ, రిజిస్ట్రార్లు అవకతకవలకు పాల్పడ్డారని, ఇంకా పలు ఆరోపణలు చేస్తూ సోమవారం ఈ శిబిరంలో విద్యార్థి సంఘాల జేఏసీ చైర్మన్‌ తిరుపతి యాదవ్‌, ఇతరులు చార్జిషీట్‌ విడుదల చేశారు. తిరుపతియాదవ్‌ మాట్లాడుతూ యూనివర్సిటీలో న్యాక్‌పేరుమీద కూడా అవకతకవకలు పాల్పడ్డారని ఆరోపించారు.

అదనపు కట్న వేధింపులకు తాళలేక..

బావిలో దూకి వివాహిత ఆత్మహత్య
- కూతురును హత్య చేశారని తల్లితండ్రుల ఆరోపణ
- గార్ల మండలం తిర్లాపురంలో ఘటన


దేవి (ఫైల్‌)

గార్ల: భర్త, అత్తామామ అదనపు కట్నం వేధింపులకు తాళలేక ఓ వివాహిత బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మండలంలోని తిర్లాపురంలో జరిగింది. ఎస్సై వెంకన్న కథనం ప్రకారం గ్రామానికి చెందిన లావుడ్యా బాబురావుకు డోర్నకల్‌ మండలం బోరింగ్‌తండాకు చెందిన దేవి(24)తో 5 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. ఈ క్రమంలో గతేడాది నుంచి భర్త, అత్తామామలు అదనపు కట్నం తీసుకురావాలని తరచూ వేధింపులకు పాల్పడుతున్నారు. దీంతో ఈ వేధింపులు తాళలేక దేవి.. సోమవారం తెల్లవారుజామున గ్రామ సమీపంలోని వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఉదయం లేచిన భర్త బాబురావు.. దేవి కోసం వెతకగా ఆమె ఆచూకీ లభ్యం కాలేదు. అనుమానం వచ్చి గ్రామ సమీపంలోని వ్యవసాయ బావిలో వెతకగా సాయంత్రం దేవి మృతదేహం లభ్యమైంది. ఘటనా స్థలాన్ని గార్ల బయ్యారం సీఐ కె బాబూరావు, ఎస్సై సందర్శించారు. కాగా, మృతురాలి తల్లితండ్రులు తమ కూతురును భర్త, అత్తామామలు చంపి బావిలో పడేశారని ఆరోపించారు. భర్త పరారీలో ఉన్నాడు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబాబాద్‌ ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

కేసముద్రం మండలంలో బాలిక..

కేసముద్రం: ఓ బాలిక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మహబూబాబాద్‌ జిల్లా కేసముద్రం మండలంలోని ఓ గ్రామంలో జరిగింది. ఎస్సై తిరుపతి కథనం ప్రకారం మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ బాలికను, అదే గ్రామానికి చెంది ఓ బాలుడు కొంతకాలంగా ప్రేమిస్తున్నానంటూ మాయమాటలు చెప్పి లోబర్చుకున్నాడు. దీంతో ఆ బాలిక గర్భం దాల్చింది. ఈ క్రమంలో తనను పెళ్లిచేసుకోవాలంటూ ఇటీవల ఆ బాలుడిని అడుగగా నిరాకరించాడు. పైగా దూషించాడు. దీంతో మనస్తాపానికి గురైన బాలిక ఈనెల 8న పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబీకులు బాలికను జిల్లా కేంద్రంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆ బాలిక సోమవారం మృతి చెందింది. దీనిపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

నెక్కొండ తండా జీపీ పరిధిలో వ్యక్తి..


అశోక్‌ (ఫైల్‌)

నెక్కొండ: అప్పుల బాధతో ఓ వ్యక్తి గడ్డి నివారణ మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన సోమవారం మండలంలోని నెక్కొండ తండా జీపీ పరిధిలో జరిగింది. ఎస్సై జానీపాషా కథనం ప్రకారం గ్రామానికి చెందిన బోడ అశోక్‌ (32) గతేడాది క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడగా సుమారు రూ. 2లక్షలు, ఇటీవల గృహ నిర్మాణం చేపట్టడంతో మరి కొంత అప్పు అయింది. మొత్తం రూ.8 లక్షల మేర అప్పు అయింది. దీంతో అప్పు ఎలా తీర్చాలనే మనోవేదనతో ఉదయం గ్రామ శివారులోని ఎస్సారెస్పీ పక్కన గడ్డి నివారణ మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై తండాకు చెందిన బోడ నవీన్‌ ఫోన్‌లో కుటుంబీకులు సమాచారం అందించారు. వారు హుటాహుటినా ఘటనా స్థలికి చేరుకుని చికిత్స నిమిత్తం నెక్కొండలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించగా వైద్యులు అప్పటికే అశోక్‌ మృతి చెందాడని ధ్రువీకరించారు. దీనిపై మృతుడి తండ్రి వాగ్యా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై జానీపాషా తెలిపారు. మృతుడికి భార్య నిరోష, కుమారుడు యువరాజ్‌, కుమార్తె ఐశ్వర్య ఉంది.

భూ వివాదంపై ఏసీపీ విచారణ

ఖిలా వరంగల్‌: వరంగల్‌ 37వ డివిజన్‌ దూపకుంట రోడ్డులోని ఓల్డ్‌ (891 న్యూ) సర్వే నంబర్‌ 1372లోని 21 గుంటల వ్యవసాయ భూమి ఓ ప్రజాప్రతినిధికి తల్లిదండ్రుల నుంచి వారసత్వంగా సంక్రమించింది. ఆ భూమిని 2012లో ప్లాట్లు చేయగా.. ఎనిమిది మంది కొనుగోలు చేశారు. 11 ఏళ్లుగా అన్ని రకాల అనుమతులు తీసుకుని ఇళ్లు నిర్మించారు. ఇంటి పన్ను చెల్లిస్తుండగా భూమిని విక్రయించిన సమీప బంధువైన ఓ వ్యక్తి.. రాత్రికి రాత్రే ఓ ఇంటిని ధ్వంసం చేశాడు. దీంతో ఆ వ్యక్తిపై మిల్స్‌కాలనీ పోలీస్‌ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆ కేసు దర్యాప్తులో ఉండగానే 11 ఏళ్లుగా కబ్జాకు యత్నిస్తూ పేదల స్థలాల చుట్టూ నిర్మించిన ప్రహరీ, ఫెన్సింగ్‌ ధ్వంసం చేయగా మరో కేసు నమోదైంది. దీనిపై బాధితులు సీపీ రంగనాథ్‌ను కలిసి తమ పరిస్థితి వివరించినట్లు తెలిసింది. దీంతో సీపీ విచారణ చేపట్టాలని ఆదేశించడంతో సోమవారం ఏసీపీ బోనాల కిషన్‌ భూమి వద్దకు వెళ్లారు. భూమి తమదంటున్న వ్యక్తితోపాటు ప్లాట్లు కొనుగోలు చేసిన వారి ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. పట్టదారుడికి భూమి ఎలా సంక్రమించిందో మంగళవారం పూర్తి వివరాలు సేకరించి నివేదిక రూపొందించిన అనంతరం ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు ఏసీపీ చెప్పినట్లు బాధితుడు నూనె రవి తెలిపారు.

13న బాలబాలికలకు రెజ్లింగ్‌ ఎంపికలు

విద్యారణ్యపురి : ఉమ్మడి వరంగల్‌ జిల్లాలోని హనుమకొండ, వరంగల్‌, మహబూబాబాద్‌, జయశంకర్‌ భూపాలపల్లి, ములుగు, జనగామ జిల్లాలోని స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ (ఎస్‌జీఎఫ్‌) కార్యదర్శులు తమ తమ జిల్లాలోని బాలబాలికలను ఈనెల 13న హనుమకొండలోని జేఎన్‌ఎస్‌లో నిర్వహించే రెజ్లింగ్‌ (కుస్తీ) ఎంపికలకు పంపాలని డీఈవో ఎండీ అబ్దుల్‌హై తెలిపారు. అండర్‌- 17 విభాగంలో నిర్వహించే ఈ ఎంపిక పోటీలకు ఉదయం 9 గంటలకు హాజరుకావాలన్నారు. బాలబాలికలు తమ తమ ఆధార్‌ జిరాక్స్‌ కాపీ, పాఠశాల హెచ్‌ఎంతో ధ్రువీకరించిన బోనాఫైడ్‌ ఒరిజనల్‌ సర్టిఫికెట్‌ తీసుకురావాలన్నారు. ఈపోటీల్లో ఎంపికైన వారు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

ఫార్మసిస్ట్‌ అసోసియేషన్‌ రాష్ట్ర అధ్యక్షుడిగా సుదర్శన్‌గౌడ్‌


సుదర్శన్‌ గౌడ్‌

ఎంజీఎం : ఫార్మసిస్ట్‌ అసోసియేషన్‌ రాష్ట్ర అధ్యక్షుడిగా వరంగల్‌కు చెందిన బత్తిని సుదర్శన్‌గౌడ్‌ ఎంపిక య్యారు. తెలంగాణ ప్రభుత్వ ఫార్మసిస్ట్‌ అసోసియేషన్‌ కేంద్ర కమిటీ కార్యవర్గ సమావేశం సోమవారం హైదరాబాద్‌లోని ఫీవర్‌ ఆస్పత్రిలో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బత్తిని సుదర్శన్‌గౌడ్‌, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌గా కందకట్ల శరత్‌బాబు, అసోసియేట్‌ అధ్యక్షుడిగా అశోక్‌, జనరల్‌ సెక్రటరీలుగా సురేశ్‌, కల్యాణ్‌, కోశాధికారిగా యాదయ్య, చీఫ్‌ అడ్వయిజర్‌గా అబ్దుల్లాఖాన్‌లతో పాటు 33 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సుదర్శన్‌ గౌడ్‌ మాట్లాడుతూ వైదారోగ్యశాఖలో ఫార్మసిస్టల పాత్ర కీలకమన్నారు. ఫార్మసిస్టల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్‌ చేశారు.

బ్రేక్స్‌ జామ్‌..
- రైలు నిలిపివేత
- ఆందోళనలో ప్రయాణికులు


గుండ్రపల్లి గేటు సమీపంలో రైలునుంచి పొగ రావడంతో దిగుతున్న ప్రయాణికులు

నెక్కొండ: కాజీపేట- డోర్నకల్‌ రైల్వే జంక్షన్‌లోని వరంగల్‌ జిల్లా నెక్కొండ రైల్వేస్టేషన్‌ పరిధిలో సోమవారం మధ్యాహ్నం ఈస్ట్‌కోస్ట్‌ ఎక్స్‌ప్రెస్‌లో పొగ రావడంతో నిలిచిపోయింది. ప్రయాణికుల కథన ప్రకారం హైదరాబాద్‌ నుంచి వయా విజయవాడ మీదుగా షాలిమార్‌కు వెళ్తున్న ఈస్ట్‌కోస్ట్‌ సూపర్‌ ఫాస్ట్‌ ఎక్స్‌ప్రెస్‌ (18046)లో దట్టమైన పొగ వ్యాపించడంతో పైలట్‌ అప్రమత్తమయ్యారు. నెక్కొండ రైల్వేస్టేషన్‌ పరిధిలోని గుండ్రపల్లి రైల్వే గేటు సమీపంలో రైలు నిలిపివేశారు. పొగ రావడం, రైలు నిలిచి పోవడంతో ఆందోళనకు గురైన ప్రయాణికులు దిగి పరుగులు పెట్టారు. రైల్వే టెక్నికల్‌ సిబ్బంది మరమ్మతులు చేశారు. పది నిమిషాల తరువాత రైలు కదలడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. బ్రేక్‌లు జామ్‌ కావడంతో రైలు నుంచి పొగలు రావడం పరిపాటని రైల్వే సిబ్బంది తెలిపారు.

హత్య కేసులో ఇద్దరికి జీవితఖైదు

- ముప్పారంలో వాచ్‌మెన్‌ను హత్య చేసిన కిరాతకులు..
- తీర్పు వెల్లడించిన హనుమకొండ మొదటి అదనపు జిల్లా కోర్టు జడ్జి

వరంగల్‌ లీగల్‌ : హత్య కేసులో ఇద్దరు నేరస్తులకు జీవిత ఖైదు, జరిమానా విధిస్తూ సోమవారం హనుమకొండ మొదటి అదనపు జిల్లా కోర్టు జడ్జి టి.జయలక్ష్మి తీర్పు వెల్లడించారు. హనుమకొండ జిల్లా ధర్మసాగర్‌ మండలం ముప్పారం గ్రామానికి చెందిన బండి కుమారస్వామిని హత్య చేసిన నేరం రుజువుకావడంతో అదే గ్రామానికి చెందిన మర్రిపెల్లి యాదగిరి, గోనెల సురేష్‌కు యావజ్జీవ కారాగార శిక్ష, రూ.5 వేల చొప్పున జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు వెల్లడించింది. ప్రాసిక్యూషన్‌ కథనం ప్రకారం ముప్పారం గ్రామంలోని నాబార్డు గోదాం వద్ద మరిపెల్లి యాదగిరి వాచ్‌మెన్‌గా పనిచేసేవాడు. తనకు ఆరోగ్యం సరిగ్గాలేదని కొన్ని రోజులు తన బదులు పనిచేయాలని బండి కుమారస్వామిని కోరాడు. దీంతో కుమారస్వామి 2019 మే 19న వాచ్‌మెన్‌గా పనిలో చేరాడు. ఈ క్రమంలో 27 మే, 2019న బైక్‌పై కుమారస్వామి డ్యూటీకి వెళ్లాడు. ఇదిలా ఉండగా రోజూ డ్యూటీ ముగిసిన తర్వాత తెల్లవారుజామున మార్గమధ్యలో ఉన్న తమ పాడి పశువుల పాలు పిండుకొని ఉదయం 5 గంటల వరకు కుమారస్వామి ఇంటికి వచ్చేవాడు. ఆ రోజు ఎంతకూ రాలేదు. దీంతో ఉదయమే ఆయన కుమారుడు రాజు గోదాం వద్దకు వెళ్లగా దుప్పటి కప్పి ఉంది. దానిని తీసివేయగా గాయాలతో కుమారస్వామి మృతి చెంది ఉన్నాడు. వెంటనే కేకలు వేయగా చుట్టు పక్కల వారు రాగా, తన తల్లికి ఫోన్‌ ద్వారా సమాచారం ఇచ్చాడు. ఘటనను పరిశీలించిన అనంతరం తన తండ్రిని పనిలో పెట్టించిన మర్రిపెల్లి యాదగిరి, మరో వ్యక్తి గోనెల సురేష్‌ హత్య చేసి ఉంటారని అనుమానిస్తూ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను అరెస్ట్‌ చేసి కోర్టులో హాజరుపర్చారు. విచారణలో సాక్ష్యాధారాలను పరిశీలించగా తాత్కాలికంగా తన బదులు వాచ్‌మెన్‌గా పనిలో పెడితే కుమారస్వామి పర్మినెంట్‌కు ప్రయత్నిస్తున్నాడని భావించిన యాదగిరి.. ప్లాన్‌ ప్రకారం సురేష్‌ సాయంతో హత్య చేశాడు. నేరం రుజువుకావడంతో ఇరువురు నేరస్తులకు యావజ్జీవ కారాగార శిక్ష, జరిమానా విధిస్తూ జడ్జి జయలక్ష్మి తీర్పు ఇచ్చారు. కేసును పోలీస్‌ అధికారులు శ్రీలక్ష్మి, శ్రీనివాస్‌జీ పరిశోధించారు. లైజన్‌ ఆఫీసర్‌ డి.వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో కానిస్టేబుళ్లు అశోక్‌, రాజేందర్‌, హోంగార్డు సుధాకర్‌రాజు, సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. పీపీ బి.రాజమల్లారెడ్డి కేసు వాదించారు.

చాతి, పొట్టలో విచక్షణారహితంగా పొడిచి..

- వ్యక్తి దారుణ హత్య
- ఆపై బంగారం, నగదు అపహరణ
- బయ్యారంలో ఘటన


నారాయణసింగ్‌ (ఫైల్‌)

కాటారం : ఒంటరిగా జీవిస్తున్న ఓ వ్యక్తిని దుండగులు దారుణంగా హత్య చేశారు. ఈ ఘటన జయశంకర్‌ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం బయ్యారం సమీపంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం కాటారం మండలం కొత్తపల్లికి చెందిన అజ్మీరా నారాయణసింగ్‌(50) బయ్యారం స్టేజీ సమీపంలో దుకాణం నడుపుకుంటూ ఒంటరిగా జీవనం కొనసాగిస్తున్నాడు. నారాయణసింగ్‌ తల్లి కొత్తపల్లిలోనే ఉంటుంది. రోజూ ఉదయం తల్లి వద్దకు వెళ్లి భోజనం పెట్టివస్తుంటాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి తన దుకాణంలోనే నిద్రకు ఉపక్రమించాడు. అర్ధరాత్రి సమయంలో దుండగులు ఇంట్లోకి ప్రవేశించి నారాయణసింగ్‌ను దారుణంగా హత్య చేశారు. ముఖంపై, ఛాతిలో, పొట్టలో విచక్షణా రహితంగా పొడవడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. సోమవారం ఉదయం నారాయణసింగ్‌ ఇంటికి ఓ రైతు రాగా తలుపులు తెరిచి ఉన్నాయి. దీంతో అనుమానం వచ్చిన సదరు రైతు ఇంట్లోకి వెళ్లి చూడగా మంచంపై నారాయణసింగ్‌ రక్తమడుగులో ఉండడం గమనించి బంధువులు, పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, సీఐ రంజిత్‌రావు, ఎస్సై-2 సురేశ్‌ మృతదేహాన్ని పరిశీలించి హత్య జరిగిన తీరుపై ఆరా తీశారు. క్లూస్‌ టీం ఘటనా స్థలానికి చేరుకుని రక్తపు మరకలు, వేలుముద్రలు సేకరించింది. అనంతరం ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రంజిత్‌రావు తెలిపారు. కాగా, నారాయణసింగ్‌ శరీరంపై ఉన్న సుమారు నాలుగు తులాల బంగారం, కొంత డబ్బును దుండగులు అపహరించుకుపోయినట్లు బంధువులు తెలిపారు. కాగా, నారాయణసింగ్‌ మృతదేహాన్ని ఎస్పీ కరుణాకర్‌ పరిశీలించారు. సిబ్బంది, చుట్టు పక్కల వారితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కేసును త్వరితగతిన చేధించాలని సిబ్బందిని ఆదేశించారు.

పోలీసుల అదుపులో అనుమానితులు?

నారాయణసింగ్‌ హత్య కేసులో పలువురు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. నారాయణసింగ్‌ ఇంట్లో అద్దెకు ఉండి ఇటీవల ఖాళీ చేసిన ఓ వ్యక్తితో పాటు నారాయణ దుకాణంలో తరుచూ మద్యం సేవించే వ్యక్తులతో పాటు మరికొంత మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. బంగారం, డబ్బు కోసమే హత్య జరిగి ఉంటుందా లేక ఇతర ఏమైనా కారణాలు ఉన్నాయా అనే కోణంలో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

భార్యను కడతేర్చిన భర్త..

- పోలీసుల ఎదుట లొంగిపోయిన కసాయి..
- ఏప్రిల్‌ 24న గొల్లపల్లిలో ఘటన
- వివరాలు వెల్లడించిన పోలీసులు


కుమారస్వామి అరెస్ట్‌ చూపిస్తున్న పోలీసులు

గణపురం: మరదలిపై మోజుతో తన భార్య శారదను హతమార్చి అనారోగ్య కారణంతో మృతి చెందినట్లు చిత్రీకరించిన భర్త జక్కుల కుమారస్వామి గణపురం పోలీసుల ఎదుట లొంగిపోయాడు. దీంతో కుమారస్వామిని అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించినట్లు చిట్యాల సీఐ వేణుచందర్‌, గణపురం ఎస్సై మచ్చ సాంబమూర్తి తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన కుమారస్వామి తన భార్య గర్భిణిగా ఉన్న సమయంలో మరదలితో వివాహేతర సంబంధం ఏర్పరుచుకున్నాడు. మరదలిపై మోజుతో తన భార్యను గత ఏప్రిల్‌ 24న హత్య చేసి అనారోగ్యంతో మృతి చెందినట్లుగా నమ్మించే ప్రయత్నం చేశాడన్నారు. అనుమానం వచ్చిన మృతురాలు తండ్రి జూజరి ఐలయ్య పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితుడు పరారయ్యాడు. పోలీసులు కుమారస్వామి కోసం గాలిస్తున్నారు. ఈ క్రమంలో ఆయనే సోమవారం స్వయంగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి లొంగిపోయాడు. తన భార్యను తానే హతమార్చినట్లు నేరం ఒప్పుకున్నాడు. దీంతో పోలీసులు కుమారస్వామిని అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు.